క్లుప్తంగా

నేడు సహజయోగా ధ్యాన పరిచయ కార్యక్రమం

కేపీహెచ్‌బీకాలనీ: పరమపూజ్య శ్రీమాతాజీ నిర్మలాదేవి సహజయోగ ట్రస్ట్ తెలంగాణ వారి ఆధ్వర్యంలో కేపీహెచ్‌బీకాలనీ రమ్యా గ్రౌండ్‌లో సహజ యోగా ధ్యాన పరిచయ కార్యక్రమం నిర్వహించనున్నారు. 4వ తేదీ శనివారం సాయంత్రం 5గంటలకు శాస్త్రీయ సంగీతం, నాటిక, అనంతరం సహజయోగ పరిచయ కార్యక్రమం ఉంటుందని నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. వివరాలకు ఫోన్ నం. 89999 82200.

నేడు 'ఆహా ఏమి పద్యం' కార్యక్రమం

మోతీనగర్: నవ సాహితీ ఇంటర్నేషనల్ ×ఆహా ఏమి పద్యం×చానల్ ఆవిష్కరణ, తెలుగు పద్య వైభవం, ప్రత్యేక సాహిత్య కార్యక్రమాన్ని శనివారం మోతీనగర్ కో–ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ కమ్యూనిటీహాల్‌లో సాయంత్రం 5.30 గంటలకు ఉంటుందని నిర్వాహకులు పేర్కొన్నారు.పద్యాల పోటీ పర్యవేక్షణకు వ్యాఖ్యానం శిరీష బుర్రా, నిర్వహణ అంజిరెడ్డి చూస్తారన్నారు. కార్యక్రమానికి కాలనీవాసులు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

రేపు శ్రీలక్ష్మీగణపతి హోమం

మోతీనగర్: పాండురంగనగర్ పార్కు మినీ మీటింగ్‌హాల్‌లో ఆదివారం ఉదయం 6గంటలకు శ్రీలక్ష్మీగణపతి హోమం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో సకుటుంబ సపరివార సమేతంగా పాల్గొని గణపతి ఆశీస్సులు అందుకోవాలన్నారు. పూజ అనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

ప్రజా సమస్యలు తెలుసుకునేందుకే పాదయాత్ర

బాలానగర్: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యలు పరిష్కారమయ్యే విధంగా కృషి చేస్తామని బీజేపీ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు పన్నాల హరీష్‌రెడ్డి, నాయకులు వడ్డేపల్లి రాజేశ్వరరావు అన్నారు. శుక్రవారం బీజేపీ నాయకులు ఫతేనగర్ డివిజన్ పరిధిలోని ఎల్‌బీఎస్‌నగర్‌లో ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు పాదయాత్ర చేశారు. కాలనీవాసులు అర్హులైన వారికి పెన్షన్లు రావటం లేదన్నారు. వీధి దీపాలు వెలగటం లేదని వారి దృష్టికి తీసుకొచ్చారు. సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కృష్ణగౌడ్, డివిజన్ అధ్యక్షుడు ఉదయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

జర చూసి..



మూసాపేట: భరత్‌నగర్‌కాలనీ సీనియర్ సిటిజన్ పార్కు వద్ద డ్రైనేజీ మ్యాన్‌హోల్ పగిలిపోయి ప్రమాదకరంగా ఉంది. రోడ్డు మధ్యలో ఉండటంతో చిన్నారులు ప్రమాదం బారిన పడే అవకాశం ఉంది. సమీపంలో పలు పాఠశాలలు ఉండటం వల్ల మ్యాన్‌హోల్‌లో పడే ప్రమాదం ఉండటంతో స్థానికులు మ్యాన్‌హోల్‌లో కర్రను ఏర్పాటు చేశారు. వాహనదారులకు కూడా ఇబ్బందికరంగా మారింది. అధికారులు స్పందించి వెంటనే మ్యాన్‌హోల్ సమస్యను పరిష్కరించాలి.

కాంగ్రెస్, బీజేపీ చెప్పే మాటలు నమ్మొద్దు

● బూత్‌స్థాయి సమావేశంలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ● అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్నా.. ● మరోసారి ఆశీర్వదించండి



బూత్‌స్థాయి కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



పాల్గొన్న బూత్ స్థాయి కార్యకర్తలు, నాయకులు, మహిళలు

ఓల్డ్ బోయిన్‌పల్లి: 'కార్యకర్తలే మా సైన్యమని పూటకో మాట చెప్పి పబ్బం గడుపుకునే కాంగ్రెస్, బీజేపీ నాయకుల మాటలు నమ్మొద్దని... మీ ఇంటి పెద్ద కొడుకుల పని చేస్తున్న తనను మరోసారి ఆశీర్వాదించాలని'కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ప్రజలకు కోరారు. ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ భాగ్యశ్రీ గార్డెన్‌లో శుక్రవారం బూత్‌స్థాయి కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఎమ్మెల్సీ నవీన్‌రావు, కార్పొరేటర్ నర్సింహయాదవ్‌తో కలసి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు.

◆ తెలంగాణ ఏర్పాటుకు ముందు నీటి కటకటతో అల్లాడిన ప్రజలకు ఇప్పుడు ఇంటింటికీ తాగునీరు అందిస్తున్నామని తెలిపారు. దేశానికే రోల్ మోడల్‌గా తయారవుతున్న తెలంగాణను చూసి బీజేపీ నాయకులు అబద్ధాపు ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం పింఛన్ ఇస్తుంటే సగం మేమే ఇస్తున్నామని బీజేపీ నేతలు చెప్పడం సిగ్గు చేటన్నారు.

బీజేపీ నాయకులే కాబ్జాలు చేశారు..

కూకట్‌పల్లిలోని 9 చెరువులను బీజేపీ నాయకులే కాబ్జాలు చేశారన్నారు. ఈ విషయంపై బండి సంజయ్ కూకట్‌పల్లికి వచ్చినప్పుడు నిరూపిస్తామని సవాల్ విసిరితే తోక ముడిచారని పేర్కొన్నారు. ఎన్నికలు రాబోతున్నాయని చెప్పి బీజేపీ హిందూ, ముస్లింల మధ్య గొడవ పెట్టేందుకు పిచ్చి కూతలు కూస్తున్నారని అన్నారు. మరోసారి రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వమే వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఇతర పార్టీలు ఎన్ని కుట్రలు కుతంత్రాలు చేసినా ప్రజలు బీఆర్ఎస్ పార్టీకే పట్టం కట్టడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు.

నూటికి నూరు శాతం అభివృద్ధి పరిచాం

కూకట్‌పల్లి నియోజకవర్గంలోని డివిజన్లలో నూటికి నూరు శాతం అభివృద్ధి పరిచామన్నారు. ఇంకా ఏమైనా సమస్యలు ఉంటే నేరుగా తన దృష్టికి తీసుకురావాలని కోరారు. ఎమ్మెల్సీ నవీన్ రావుకు వచ్చే నిధులను కూడా నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాలలో అభివృద్ధి చేశామని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలో సోలర్ సిస్టమ్స్‌ను ఏర్పాటు చేశామన్నారు. కోటి రూపాయలతో హస్మత్ ప్రభుత్వ పాఠశాలను నిర్మించనున్నామని తెలిపారు.

కార్యకర్తలు చిత్తశుద్ధితో పనిచేయాలి

బూత్‌స్థాయిలో ప్రతి కార్యకర్త చిత్తశుద్ధితో పని చేయాలన్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నరేందర్‌గౌడ్, సయ్యద్ ఏజాజ్, కర్రె జంగయ్య, మక్కాల నర్సింగ్‌రావు, కర్రె లావణ్య, ఇర్ఫాన్, మేకల హరినాథ్, బుర్రియాదగిరి, రాజేశ్వరీ, బల్వంత్‌రెడ్డి, పిట్ల రాజు, గడ్డం నర్సింగ్‌రావు, చారి, ఖాదీర్, మట్టి శ్రీను, రాజుగౌడ్, గణేష్, లలిత, కుమార్, సరోజ, అనురాధ, పోచయ్య, చందుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

17 నుంచి పాదయాత్ర...

ఈనెల 17వ తేదీ నుంచి 22వ తేదీ వరకు కార్పొరేటర్ ప్రతి ప్రాంతంలో పాదయాత్ర చేసి ఇంటింటికి తిరిగి సమస్యలను తెలుసుకుని వాటిని తీర్చేలా కృషి చేస్తామని ప్రజలు ఎలాంటి సమస్య ఉన్న చెప్పాలని సూచించారు. 9 డివిజన్లలో త్వరలో డివిజన్‌కు 5 రోజుల పాటు తాను అధికారులతో కలసి పాదయాత్ర చేసి సమస్యలను తెలుసుకుని పరిష్కారిస్తామని హామీ ఇచ్చారు.

వీధి కుక్కలతో అప్రమత్తంగా ఉండాలి



ఎస్ఎస్ఎస్‌కే పాఠశాలలో అవగాహన కల్పిస్తున్న కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్

కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి

బాలానగర్: బాలానగర్ మండల ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం వీధి కుక్కలపై విద్యార్థులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి బాలానగర్ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి హాజరై మాట్లాడారు. వీధి కుక్కల పట్ల చిన్నారులు ఏ విధంగా ప్రవర్తించాలో అవగాహన కల్పించారు. అనంతరం సర్కిల్ వెటర్నరీ డాక్టర్ లింగస్వామి పలు సూచనలు చేశారు. మున్సిపల్ పరిధిలో వీధి కుక్కల నివారణ చర్యల్లో భాగంగా వీధి కుక్కలకు పిల్లలు పుట్టకుండా ఆపరేషన్, రేబిస్ టీకా వేసి వదిలి పెడతామన్నారు. అదే విధంగా ఎండాకాలంలో కుక్కలు డీహైడ్రేషన్‌తో వింతగా ప్రవర్తిస్తాయని అన్నారు. వాటికి కావాల్సిన తాగునీటిని, ఆహారాన్ని అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ విభాగం డిప్యూటీ డైరెక్టర్ సుకునందం రెడ్డి, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీకాంత్‌రెడ్డి, ఎస్ఆర్‌పీ నాగేశ్వర్ నాయక్, ఎస్ఎఫ్ఎ ప్రకాష్, బోశంకర్, నాగరాజు, ఉపాధ్యాయులు నాయకులు దేవులపల్లి కృష్ణమూర్తి, ఆదిమూల నగేష్, బాజిని నాగేందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎస్ఎస్‌కే స్కూల్‌లో...

బాలానగర్: ఫతేనగర్ డివిజన్ పరిధిలోని ఎస్ఎస్ఎస్‌కే స్కూల్‌లో వీధి కుక్కల బెడదపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్ పాల్గొని మాట్లాడారు. వీధి కుక్కలు వెంటాడుతున్నప్పుడు పారిపోకుండా ఉండాలన్నారు. వీధి కుక్కల నుంచి దూరంగా ఉండాలన్నారు. వీధి కుక్కలపై రాళ్లు, ఇతర వస్తువులు వేయటంతో అవి బెదిరిపోయి కరుస్తాయని అన్నారు. అందుకు ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు, ఎంటమాలజీ సిబ్బంది, అసిస్టెంట్ డైరెక్టర్ ఈశ్వర్‌రెడ్డి, డేవిడ్, శవి, శ్రావణ, సురేందర్ నాయుడు, మల్లిక్ తదితరులు పాల్గొన్నారు.

కేపీహెచ్‌బీ ఠాణా ఏర్పాటుకు స్థలం పరిశీలన

కేపీహెచ్‌బీకాలనీ: కేపీహెచ్‌బీలో తాత్కాలిక పోలీస్‌స్టేషన్ కోసం 6వ ఫేజులోని మోడల్ మార్కెట్ వద్ద కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు, ఏసీపీ చంద్రశేఖర్‌రావు, సీఐ కిషన్‌లతో ఆ ప్రాంతాన్ని శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. తాత్కాలిక పోలీస్‌స్టేషన్ కొరకు ఈ ప్రాంతాన్ని పరిశీలించామన్నారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా అత్యాధునిక సదుపాయాలతో నూతన పోలీస్‌స్టేషన్‌ను ఏర్పాటు చేయబోతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈ ఆనంద్, ఏఈ సాయిప్రసాద్, డివిజన్ అధ్యక్షుడు కృష్ణారెడ్డి పాల్గొన్నారు.



ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని పట్టించుకోవడం లేదు



పాదయాత్ర సమస్యలను తెలుసుకుంటున్న బీజేపీ సీనియర్ నాయకుడు గజ్జల యోగానంద్, నేతలు

భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ హెచ్ఎంటీ హిల్స్, ఆదిత్యానగర్‌లో సమస్యలు తెలుసుకునేందుకు శేరిలింగంపల్లి బీజేపీ సీనియర్ నాయకులు గజ్జల యోగానందన్ శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో అధిక పన్నులు చెల్లిస్తున్న శేరిలింగంపల్లి నియోజకవర్గంలో ట్రాఫిక్ సమస్య, పెన్షన్లు, రేషన్‌కార్డులు, డ్రైనేజీ, నీటి సమస్య ప్రధానంగా ఉన్నాయన్నారు. ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని పట్టించుకోవటం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ట్రాఫిక్‌తో అనేక మంది వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు.

◆ చెత్త కుండీల తీసివేయటంతో రోడ్లపైనే చెత్తను వేస్తున్నారని అన్నారు. డ్రైనేజీ సమస్యలతో అనేక ప్రాంతాల్లో రోడ్లపై డ్రైనేజీ నీరు ప్రవహిస్తోందన్నారు. ఈ సమస్యలపై అధికారులు తక్షణమే స్పందించి పరిష్కరించాలని కోరారు. లేకపోతే బీజేపీ నాయకులతో ధర్నాలు చేస్తామని హెచ్చరించారు. వెలగా శ్రీనివాస్, నవీన్‌గౌడ్, బాలకృష్ణ, చంద్రమౌళి, దుర్గా రాజేశ్వరి, కోటేశ్వరరావు, అన్నపూర్ణ, లక్ష్మి, కరుణాకర్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతిలో 100 శాతం ఉత్తీర్ణత సాధించాలి

బీజేపీ రాష్ట్ర నాయకులు రవికుమార్ .. విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



గచ్చిబౌలి: పదో తరగతి పరీక్షలలో 100 శాతం ఉత్తీర్ణత సాధించాలని బీజేపీ రాష్ట్ర నాయకులు రవికుమార్‌యాదవ్ సూచించారు. కొండాపూర్‌లోని మసీదుబండలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ఆయన శుక్రవారం స్టడీ మెటీరియల్‌ను ఆర్‌కేవై ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచితంగా అందించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చక్కగా చదవాలనే తపనతో స్టడీ మెటీరియల్‌ను నిష్ణాతులైన ప్రొఫెసర్ల సమక్షంలో ముద్రించడం జరిగిందన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని అన్ని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు మెటీరియల్ అందిస్తామన్నారు.

వ్యాపార పరిజ్ఞానాన్ని పెంచుకోవాలి

బాలానగర్: ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ఎంఎస్ఎంఈ ఆధ్వర్యంలో నిర్వహించే వెండర్స్ ప్రోగ్రామ్స్‌కు హాజరై వ్యాపార పరిజ్ఞానాన్ని పెంచుకోవాలని బాలానగర్ ఎంఎస్ఎంఈ అడిషనల్ డెవలప్‌మెంట్ కమిషనర్ డి.చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం బాలానగర్‌లోని సంస్థ కార్యాలయం ఆవరణలో రెండు రోజుల వెండర్స్ ప్రోగ్రామ్ సదస్సు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాట్లాడుతూ... ముద్ర లోన్స్ ఉదయ రిజిస్ట్రేషన్స్, ఎంఎస్ఎంఈ స్కీమ్స్, రాయితీలు గురించి తెలిపారు. ఈ కార్యక్రమంలో బీడీఎల్ డిప్యూటీ మేనేజర్ నాగార్జునరావు, మేనేజర్ బిశ్వాస్, బీఈఎల్ మేనేజర్ వి. ప్రభాకర్‌రావు, ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ స్మాల్ ఇండస్ట్రీస్ అసోసియేషన్ అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

వేడుకగా పుష్కర బ్రహ్మోత్సవాలు

కుత్బుల్లాపూర్: గోదావరి హోమ్స్‌లోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ పుష్కర బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామివారికి విశేష అభిషేకాలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారిని ప్రత్యేక ఆభరణాలతో అలంకరించారు.

5న త్రోబాల్ రాష్ట్ర జట్టు ఎంపిక పోటీలు

కూకట్‌పల్లి: ఛత్తీస్‌ఘడ్‌లో ఈనెల 28 నుంచి 30వ జరిగే సబ్ జూనియర్ జాతీయస్థాయి త్రోబాల్ పోటీల్లో పాల్గొనే జట్లకు పోటీలు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర త్రోబాల్ అధ్యక్షుడు కృష్ణారెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 5వ తేదీ హైదరాబాద్ గండిపేట్ ఎక్స్ రోడ్ దగ్గరలోని పల్లవి ఇంటర్నేషనల్ పాఠశాలలో పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. సబ్ జూనియర్ విభాగంలో పాల్గొనే బాల బాలికలు 1ఏప్రిల్ 2007 నాటికి జన్మించి ఉండాలని తెలిపారు. ఎంపిక పోటీలకు హాజరయ్యే క్రీడాకారులు పాఠశాల నుంచి స్టడీ సర్టిఫికెట్, ఆధార్‌కార్డుతో ఎంపిక పోటీల్లో పాల్గొనాల్సిందిగా నిర్వాహకులు కోరారు. మెహదీపట్నం నుంచి 288 బీ.డీ, కే, ఆర్ ఆర్టీసీ బస్సులు అందుబాటులో ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. వివరాలకు జమీల్ 99499 70122, అరుణ్‌గౌడ్ 70325 86771.

సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తా



రిక్షాపుల్లర్స్ కాలనీలో డ్రైనేజీ సమస్యను పరిశీలిస్తున్న ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ



పెంచిన గ్యాస్ సిలిండర్ ధరలకు నిరసన తెలుపుతున్న ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే గాంధీ

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్ డివిజన్ పరిధిలోని రిక్షాపుల్లర్స్ కాలనీ, రామకృష్ణనగర్, వెంకటేశ్వరనగర్ కాలనీల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై శుక్రవారం ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, స్థానిక కార్పొరేటర్ మాధవరం రోజాదేవితో పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... శేరిలింగంపల్లి నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా ముందుకు వెళ్తున్నామన్నారు. దశలవారీగా అభివృద్ధి పనులు చేపడతామని తెలిపారు. అసంపూర్తిగా మిగిలిపోయిన పనులు త్వరగా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యలను ఇంటింటికీ తిరుగుతూ తెలుసుకొని పరిష్కరించే దిశగా పని చేస్తున్నామని పేర్కొన్నారు. కాలనీలో నెలకొన్న డ్రైనేజీ సమస్యను పరిష్కరిస్తానన్నారు. అన్ని సమస్యలను దశలవారీగా పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. వివేకానందనగర్ డివిజన్ పరిధిలో ఇప్పటికే 85 శాతం పనులు పూర్తి అయ్యాయని తెలిపారు. మిగిలిన పనులు త్వరగా పూర్తి చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేస్తామన్నారు.

పెరిగిన గ్యాస్ ధరలపై నిరసన...

సామాన్యుడిపై అధిక భారం వేస్తూ కేంద్ర ప్రభుత్వం పెంచుతున్న గ్యాస్ ధరలకు వ్యతిరేకంగా మంత్రి కేటీఆర్ పిలుపు మేరకు ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే అరెకపూడిగాంధీ, వివేకానందనగర్, ఆల్విన్‌కాలనీ కార్పొరేటర్లు రోజాదేవి రంగారావు, దొడ్ల వెంకటేష్‌గౌడ్‌లు రిక్షాపుల్లర్స్ కాలనీ, ఎల్లమ్మబండ హోటల్ చౌరస్తాలో శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ.. భారతదేశ జీడీపీ పెంచమంటే కేంద్ర ప్రభుత్వం గ్యాస్, డీజిల్, పెట్రోల్ ధరలు పెంచుతోందన్నారు. సామాన్యుడిపై అధిక భారం వేసి సామాన్యుడి నడ్డి విరుస్తోందన్నారు. దేశంలో వాణిజ్య సిలిండర్ ధరలు పెరడగం ఈ ఏడాదిలో రెండోసారి అని తెలిపారు.

విద్యుత్ ఉండని ప్రాంతాలు

భాగ్యనగర్‌కాలనీ: ఆదిత్యనగర్, ఎన్‌టీఆర్ నగర్, పీజేఆర్‌నగర్ ఫీడర్ల పరిధిలో శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సమస్య కారణంగా విద్యుత్ నిలిపివేయనున్నట్లు ఏఈ ఓ ప్రకటనలో తెలిపారు. ఆదిత్యనగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 నుంచి 12గంటల వరకు.. ఎన్‌టీఆర్‌నగర్ ఫీడర్ పరిధిలోని ప్రాంతాల్లో మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 3గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి



షేక్ ఇస్మాయిల్ (ఫైల్)

భాగ్యనగర్‌కాలనీ: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... యల్లమ్మబండ, ఖాజానగర్‌లో నివసించే మొహమ్మద్ ఖలీల్ ఈనెల 2వ తేదీన మిత్రులతో కలిసి నాంపల్లికి వెళ్లాడు. 3వ తేదీ ఉదయం 1.40 గంటల సమయంలో తిరిగి వస్తుండగా వివేకానందనగర్‌లోని సుమిత్రానగర్ యూటర్న్ వద్దకు రాగానే వెనుక నుంచి వివేకానందనగర్‌లో నివసించే కె. భానుచందర్ బుల్లెట్ వచ్చి మొహమ్మద్ ఖలీల్ బైక్‌ను ఢీకొట్టాడు. దీంతో ఖలీల్ నడిపే వాహనం కింద పడిపోయింది. బైక్‌పై ఉన్న ఖలీల్ స్నేహితుడు షేక్ ఇస్మాయిల్ తలకు, ఇతర శరీర భాగాలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే చుట్టు పక్కల వారి సహాయంతో దగ్గరలోని రామ్‌దేవ్‌రావు ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు అతివేగంగా వచ్చి మిత్రుడి మృతికి కారణమైన భానుచందర్‌పై చర్యలు తీసుకోవాలని కూకట్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.